

# సుబ్బారావు-సన్యాసం

కొలకలూరి నాగేశ్వరరావు

సుబ్బారావు సంసార సముద్రాన్ని ఈదలేక విసుగుచెంది సన్యాసులలో కలిసి పోదామనుకొన్నాడు. సన్యాసికి ముక్తిలభిస్తుందని ఎప్పుడో విన్నాడు. ఆ విశ్వాసంతో పెళ్ళాం, బిడ్డల్ని వదలి బయలు దేరాడు.

ఊరి చివర మర్రిచెట్టుక్రింద ఓ సాధువు కూర్చుని తదేక దీక్షతో కనులు మూసుకొని భగవద్ధ్యానములో వున్నాడు. అతని బారెడు జుట్టు, కమండలము రుద్రాక్ష మాలలు, విభూతి రేఖలు చూచి - 'ఆహా! నిజమైన సాధువు ఇతడేగదా! ఇతనిని సేవించి నా అభీష్టాన్ని నెరవేర్చుకొంటాను' అనుకొని ఆ సాధువు ఎప్పుడు కనులు తెరుస్తాడా? అని కూర్చున్నాడు సుబ్బారావు

కాస్సేపటికి ఆయోగి కనులు తెరచి - "ఏమి కావాలి నాయనా?" అని ప్రశ్నించారు.

"మహానుభావా! నేను సన్యాసాన్ని స్వీకరిద్దామనుకొంటున్నాను. నన్ను మీ శిష్యునిగా స్వీకరించండి. నా జీవితాంతము మీ పాదసేవచేసి ఎవ్వంత పుణ్యము సంపాదించుకొంటాను" అని దీనంగా వేడుకున్నాడు సుబ్బారావు.

"అనుగ్రహించాము నాయనా! ముందు మన నివాసానికి పోదాము. అచ్చట అన్నివిషయాలు మాట్లాడుకొందాము."

సాధువుగారు తిన్నగా తన ఆశ్రమానికి అంటే కలియుగములో అధునాతనముగా బంగారు రంగుతో నిర్మింపబడిన "అవుట్‌హవుస్" అనబడే ఆశ్రమంలోకి తీసుకెళ్ళారు. దానిలో జింక చర్మాలు, పులిచర్మాలకు బదులుగా డన్‌లప్ బెడ్స్. వింజామరాలకు బదులుగా ఫేన్లు వున్నవి.

అవన్నీ చూసేటప్పటికి సుబ్బారావు మెదడులో ఆలోచనలు 200 మైళ్ళ స్పీడ్‌లో పరుగెత్తాయి. "గురువర్యా! మనము లోకములో అన్నిటిని విసర్జించినాముకదా! మనకీ భవనమేమిటి? ఎలా కట్టారు" అన్నాడు ఆశ్చర్యంగా.

సాధువుగారు చిరునవ్వుతో - "పిచ్చివాడా! పూర్వం మునులు అడవులలో దర్భలతో ఆశ్రమాలు నిర్మించుకొనేవారు. కాని మనము అధునాతన సన్యాసులము ఇక దానిని ఎలా నిర్మించాము. అంటావా? గవర్నమెంటు కంట్రాక్టరుల దగ్గర కెళ్ళి వాళ్ళ అదృష్టాన్ని గొప్పగా పొగిడి. వాళ్ళు ఖర్చు పెట్టిన నాల్గు వంతులకు మూడున్నర వంతులు లాభం రావాలని దీవిస్తే వాళ్ళే పంపిస్తారు. ఓ నాలు బస్తాల సిమెంటు"

అ...లా...గా అన్నాడు నూతన సన్యాసి సుబ్బారావు"

"సుబ్బారావు! కాస్సేపు ఆ ఫేన్ ఆన్ చేయవయ్యా" అని తన నెత్తిమీదున్న విగ్గుతీసి క్రింద పెట్టాడు యోగీశ్వరులు

సుబ్బారావు ఆశ్చర్యంగా "గురువుగారు! మీకున్నది నిజమైన జుత్తుకాదా! విగ్గు తలించుకొన్నారా."

"అమాయకుడా! విగ్గు పెట్టుకొనేది మనము కాదురా. దానిని లోకానికి తగిలిస్తున్నాము సరే కాని! వొళ్ళంతా చిరాకుగా వుంది. తడిగుడ్డతో విభూతిరేఖలు తుడిచెయ్యి"

కాస్సేపు బెడ్‌పై దొర్లాడు మునీశ్వరులు. కంటికి నిదుర లేదు. దిగ్గున లేచి - "నాయనా! కాస్సేపు పేకలు కలుపుకొందామా?"

"అంటే?" సుబ్బారావు ఎదురుప్రశ్న

"అదే నాయనా! పేకముక్కలు ఆడుకొందామా?"

"నాకు అటువంటివి ఏమీ రావండి"

"ఈ కలియుగంలో వ్యర్థపడిపోయినవాడివుకావయ్యా" అన్నారు సాధువుగారు హేళనగా.

"పోనీ.. అలా వీధిలోకి వెళ్ళి ఒంటరి పక్షులు అంటే...ఆడపిల్లలు... వెడుతుంటే ఈలవేసి, కన్నుకొట్టి తీసుకురా."

"అయ్యబాబోయ్" అని పెద్ద అరుపు అరిచాడు సుబ్బారావు

"ఛీ...ఛీ... సన్యాసికి వుండాల్సిన లక్షణాలు ఏమీ లేవు" అని విసుక్కున్నారు గురువుగారు.

రాత్రి 10 గంటలు అవుతుంది. సాధువుగారు సుబ్బారావును పిలిచి - "మాలగూడెంలో సారా బిజినెస్ కొట్టు వుంది. ఓ నాల్గు గ్లాసులు తీసుకురా. వచ్చేటప్పుడు బజారునుంచి ఒక ప్లేటు పలావు, మేక వేపుడు, నాలు బీడీ కట్టలు తీసుకురా" అని ఆజ్ఞాపించారు.

సుబ్బారావు సన్యాసి కూపంలోంచి బయటపడి ఇంటికి పరుగుపెట్టాడు. ఈ కలియుగ సన్యాసులను సేవించినా, వాళ్ళలో కలిసినా ఎవ్వంత పుణ్యము కాదు కొండంత పాపం నెత్తిన పడుతుందనుకొన్నాడు దారిలో.

అర్ధ రాత్రి అయ్యేటప్పటికి కష్టపడి ఎలాగైతేనే తన పెళ్ళాం, బిడ్డల్ని కలుసుకొన్నాడు.

"ప్రొద్దుట్నుంచి ఎక్కడకు పోయారు?" అని అడిగింది అతగాడి భార్య.

"అన్నీ! 'కలియుగసాధువుల విపరీతబుద్ధులు' అనే సినిమా వచ్చింది. చూడ్డానికని పట్నం వెళ్ళా" నన్నాడు సన్యాసాన్ని వదలిన సంసారి సుబ్బారావు.

★